పృథులాపురి.. మట్టి రోడ్లే దిక్కు మరి..!


వర్షా కాలంలో కోర్టు రోడ్డు పరిస్థితి(ఫైల్)


నిర్మలా కాన్వెంట్ రోడ్డు దుస్థితి

- పొదిలి పట్టణంలో దారుణంగా అంతర్గత రోడ్లు
- వర్షాకాలంలో సమస్యలు రెట్టింపు
- పొంగిపొర్లుతున్న డ్రెయినేజీలు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రజలు

పొదిలి:

నగర పంచాయతీగా రూపాంతరం చెందిన పొదిలిలో అభివృద్ధి పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. పాలక వర్గం లేని పొదిలిలో అధికారులే నిర్ణయాలు తీసుకుని చిన్నాచితకా అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఒకడుగు ముందుకు పడితే నాలుగు అడుగులు వెనక్కి వేయాల్సి వస్తోంది. నగర పంచాయతీలో కనీస మౌలిక వసతులు కల్పించకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పన్నుల వసూళ్లలో ముందుండే ప్రభుత్వం.. అభివృద్ధి పనులు చేపట్టకుండా తాత్సారం చేయడంపై ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మెటల్ రోడ్లే దిక్కు..

పొదిలి పట్టణంలోని అంతర్గత రోడ్లు చూస్తే మేజర్ పంచాయతీకి ఎక్కువ, నగర పంచాయతీకి తక్కువ అన్నట్టుగా ఉన్నాయి. రోడ్లపై లోతైన గుంతలు, మొనదేలిన రాళ్లు ఉండటంతో రాకపోకల సమయంలో ప్రజలు తంటాలు పడుతున్నారు. వర్షా కాలంలో రోడ్లపై నీరు నిల్వ చేరి రాకపోకలకు సమస్యగా మారుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా నిర్మలా కాన్వెంట్ రోడ్డు, కోర్టు రోడ్డు, పిచ్చిరెడ్డి తోట, జగనన్న కాలనీ, బ్యాంకు కాలనీ, ప్రకాశ్ నగర్, టైలర్స్ కాలనీలో మెటల్ రోడ్లు దారుణంగా తయారయ్యాయి. ప్రజలు, వాహనదారులు నిత్యం వినియోగించే ఈ రోడ్ల అభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలన్న డిమాండ్ నేటికీ పరిష్కారం కాలేదు.

సైపు కల్వర్టు నిర్మించాలి

స్థానిక విశ్వనాథపురంలోని జూనియర్ కాలేజీ రోడ్డు మొదటి క్రాస్‌లో కల్వర్టు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. సైడు కాలువలు శిథిలం కావడంతో మురుగునీరు ముందుకు పోవడం లేదు. కాలువ దెబ్బతిన్న ప్రదేశం నుంచి మురుగు పైకి ఎగదన్ని ఇళ్ల మధ్యకు వెళ్తుండటంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. డ్రెయినేజీల్లో పూడిక సక్రమంగా తీయకపోవడంతో దోమలు విజృంభించి రోగాల బారిన పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. కల్వర్టు నిర్మించకపోవడం వల్ల బైకులు, కార్లు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు కల్వర్టు నిర్మించేందుకు అధికారులు అంచనాలు సిద్ధం చేసినా పనులు చేపట్టలేదు. కమిషనర్ స్పందించి కల్వర్టు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


విశ్వనాథపురంలో డ్రెయినేజీలో నిల్వ చేరిన మురుగు

క్లుప్తంగా

కంభం ఎంఈఓ-1గా అబ్దుల్ సత్తార్


నూతన ఎంఈఓను సన్మానిస్తున్న విద్యాశాఖ అధికారులు

కంభం: కంభం ఎంఈఓ-1గా అబ్దుల్ సత్తార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎంఈఓ మాల్యాద్రి బదిలీపై వెళ్లగా అర్ధవీడులో విధులు నిర్వర్తిస్తున్న అబ్దుల్ సత్తార్‌ను నియమించారు. ఆయనను పూర్వ ఎంఈఓ మాల్యాద్రి, ఎంఈఓ-2 శ్రీనివాసులు సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో మండల సమన్వయకర్త చిన్ని పద్మావతి, అకౌంటెంట్ రామచంద్రుడు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాచర్ల ఎంఈఓగా మొయినుద్దీన్

రాచర్ల: మండల ఎంఈఓ-1గా షేక్ మొయినుద్దీన్ బుధవారం పూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఈయన కంభం మండల తురిమెళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తూ పదోన్నతిపై రాచర్ల-1 ఎంఈఓగా నియమితులయ్యారు. గతంలో పనిచేసిన ఎంఈఓ ఎ.శివకోటేశ్వరరావు పర్చూరు మండలం వీరన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీ అయ్యారు. కాగా, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో ఎంఈఓ-1 తోపాటు ఎంఈఓ-2 వారణాసి గిరిధరశర్మ బుధవారం సమావేశమై సూచనలు, సలహాలు ఇచ్చారు.

5న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రాచర్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీ ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ షేక్.ఖాశింబీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎస్.వెంకటరామిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులతోపాటు అన్ని శాఖల మండల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలని సూచించారు.

ఎక్సైజ్ అధికారుల విస్తృత తనిఖీలు


మార్కాపురంలో పార్శిల్ ఏజెన్సీని తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

మార్కాపురం: మార్కాపురం ఎక్సైజ్ అధికారులు బుధవారం మార్కాపురం టౌన్, రైల్వేస్టేషన్, పెద్దదోర్నాల, పెద్దారవీడు మండలాల్లోని పలు గ్రామాల్లో, పార్శిల్ సర్వీసుల్లో, బస్టాండ్లలో తనిఖీలు నిర్వహించారు. పార్శిల్ కార్యాలయాల్లో నిషేధిత వస్తువులు బుక్ చేసినట్లయితే సమాచారం ఇవ్వాలని నిర్వాహకులను ఆదేశించారు. బెల్టుషాపుల నిర్వహణపై సమాచారం ఇస్తే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి, ఎస్సై గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

9న మెప్మా ఉద్యోగుల సమ్మె


సమ్మె నోటీసు అందిస్తున్న మెప్మా ఉద్యోగులు

గిద్దలూరు రూరల్: మెప్మా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా ఈనెల 9వ తేదీన సమ్మె చేయనున్నట్లు మెప్మా ఆర్పీలు బుధవారం సీఎంఎంకు నోటీసులు అందజేశారు. సంఘ నాయకురాళ్లు ఫాతిమా, రుతమ్మ, సాయి లక్ష్మి మాట్లాడుతూ.. ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, రూ.10 లక్షల రూపాయల గ్రూపు ఇన్సూరెన్స్ కల్పించాలని, వేతన బకాయిలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మొరాయించిన రేషన్ సర్వర్

బేస్తవారిపేట: ప్రభుత్వ చౌక ధరల దుకాణాల వద్ద మహిళలు నానా ఇబ్బందులు పడుతున్నారు. తరచూ సర్వర్ మొరాయిస్తుండటంతో బియ్యం పంపిణీ ప్రక్రియ నిదానంగా సాగుతోంది. దీంతో రేషన్ సరుకుల కోసం వచ్చిన మహిళలు ఉసూరుమంటూ వెనుదిరిగి వెళ్తున్నారు. కూర్చునేందుకు సరైన వసతి లేకపోవడంతో కార్డుదారులకు అవస్థలు పడుతున్నారు. కిలోమీటర్ దూరంలోని బేస్తవారిపేటకు నడుచుకుంటూ వచ్చి రేషన్ సరుకులు తీసుకెళ్లలేక పోతున్నామని పాపాయిపల్లెకు చెందిన కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

మహా వారాహి అలంకారంలో జగదాంబ


మహా వారాహి రూపంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

మార్కాపురం టౌన్: పట్టణంలోని మార్కండేశ్వరస్వామి ఆలయంలో జగదాంబ అమ్మవారు మహా వారాహి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగదాంబ అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు వరుణ్‌తేజ, ఆంజనేయ ప్రసాద్, అర్చక బృందం బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

ఆశ కార్యకర్త పోస్టు భర్తీకి నోటిఫికేషన్

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని పోతవరంలో ఆశ కార్యకర్త పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన, 25-45 ఏళ్ల మధ్య వయసున్న స్థానిక మహిళలు అర్హులని స్పష్టం చేశారు. ఈనెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వేడుకగా చిన్న షాహదత్

మొహర్రం సందర్భంగా పశ్చిమ ప్రకాశంలో మొదలైన పీర్ల ఉత్సవం


పగలు షాహదత్ నిర్వహిస్తున్న దృశ్యం

మార్కాపురం టౌన్: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని మార్కాపురం పట్టణంలోని గొర్లగడ్డ, తూర్పువీధిలో బుధవారం పగలు షాహదత్ నిర్వహించారు. మకానాలో బాదుల్లా సాహెబ్, బారా ఇమామ్, రంగు హుస్సేనీ, గొట్టిపడియ ఖాశీంసాహేబ్, ఇమామ్, హుస్సేన్ పీర్లు, తూర్పువీధిలోని చిన్నబాదుల్లా, సాహేబ్ పీరు ప్రసిద్ధి చెందింది. అలాగే ఆర్టీసీ బస్టాండ్, విజయటాకీస్, పూలసుబ్బయ్య కాలనీలోని పీర్లు, నాగులవరం రోడ్డులో మకానాలో ఉన్న పీర్లకు పగలు షాహదత్ నిర్వహించారు. బొరుగులు, పప్పులు ఫతేహాగా సమర్పించారు. భక్తులు పీర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

నేడు తుమ్మలచెరువులో చిన్న షాహదత్

తర్లుపాడు: హజరత్ ఇమామ్ హుస్సేన్ త్యాగాన్ని స్మరించుకుంటూ ముస్లింలు అత్యంత పవిత్రంగా నిర్వహించుకునే మొహర్రం పర్వదినం సందర్భంగా గురువారం తుమ్మలచెరువులో చిన్న షాహదత్‌కు ఏర్పాట్లు చేశారు. దర్గాలో కొలువైన పెద్దఖాశీం స్వామి, చిన్న ఖాశీం స్వాములను భక్తులు సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ కమిటీ ఆధ్వర్యంలో దర్గాను విద్యుత్ దీపాలతో అలంకరించారు. బంధు మిత్రుల రాకతో గ్రామంలో సందడి నెలకొంది.

భక్తిశ్రద్ధలతో పీర్ల పండగ

అర్ధవీడు: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని అంకభూపాలెం, పాపినేనిపల్లె గ్రామాల్లోని మకానాల్లో బుధవారం పీర్లు కొలువుదీరాయి. అంకభూపాలెం మకానాలో ఖాశీం సాహెబ్, బాదుల్లా సాహెబ్ పీర్లను సుందరంగా అలంకరించారు. అలాగే అర్ధవీడు, బొల్లుపల్లి మకానాలో పీర్లను భక్తులు దర్శించుకుని ముక్కులు చెల్లించారు. కాగా, పీర్ల పండగ సందర్భంగా అంకభూపాలెం యూత్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేశారు. విజేతలకు ప్రథమ బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతి రూ.5 వేలు అందిస్తునట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

కొనకనమిట్ల మండలంలో..

కొనకనమిట్ల: మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో మకానాలు, పీర్లను ముస్తాబు చేశారు. గురువారం నుంచి ఆదివారం వరకు పీర్ల పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం, శుక్రవారం చిన్న షాహదత్, శనివారం, ఆదివారం పెద్ద షాహదత్, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మండలంలోని బచ్చలకూరపాడు, గార్లదిన్నె, వెలుగొండ్రాయునిపల్లి, గరిమిన పెంట, పేరారెడ్డిపల్లి, సిద్ధవరం, మునగపాడు, నాగంపల్లి, గనివానిపాడు, నాయుడు పేట, చినారికట్ల గ్రామాల్లో పీర్ల ఉత్సవానికి హోమ గుండాలు సిద్ధం చేస్తున్నారు.


తుమ్మలచెరువు దర్గాలో కొలువైన పీర్లు


బచ్చలకూరపాడులో ముస్తాబైన పీర్ల చావిడి

విద్యుత్ వినియోగంలో అప్రమత్తత అవసరం


మార్కాపురం : ర్యాలీలో పాల్గొన్న విద్యుత్ శాఖ ఈఈ, సిబ్బంది

మార్కాపురం టౌన్: సేఫ్టీ టూల్స్‌తో పనిచేసి విద్యుత్ ప్రమాదాల నుంచి దూరంగా ఉండాలని విద్యుత్ శాఖ ఈఈ నాగేశ్వరరావు ప్రజలకు సూచించారు. జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో అవగాహన ర్యాలీని సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ స్తంభాలను కానీ, సపోర్టు తీగలను కానీ నేరుగా పట్టుకోవద్దని సూచించారు. విద్యుత్ తీగలు, బోర్డులకు పిల్లలను దూరంగా ఉంచాలని చెప్పారు. విద్యుత్ సరఫరాను నిలిపేయకుండా ఏ పరికరాలకూ మరమ్మతులు చేయవద్దన్నారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన విద్యుత్ ఉపకరణాలను మాత్రమే వాడాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ షియానాయక్, ఏఈలు, విద్యుత్‌శాఖ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

మురుగు సమస్య పరిష్కరించాలి


ఎంపీడీఓకు వినతి పత్రం ఇస్తున్న ఎస్సీజీ పాలెం వాసులు

కంభం: స్థానిక వై జంక్షన్ సమీపంలోని ఎస్సీజీపాలెం ఒకటో వార్డులో ఇరిగేషన్ కాలువ ఆక్రమణలతో పూడిపోవడంతో మురుగు నిలిచిపోయి దోమల బెడద అధికమైందని స్థానికులు బుధవారం ఎంపీడీఓ వీరభద్రాచారికి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా వేధిస్తోందని, వర్షాలు పడినప్పుడు రెండువైపులా ఉన్న కాలువల్లో మురుగు నిలిచిపోయి దుర్వాసన వస్తోందని వివరించారు. ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని చెప్పారు. ప్రజలు రోగాల బారిన పడకముందే పంచాయతీ అధికారులు స్పందించి కాలువలు శుభ్రం చేయించాలని మరమ్మతులు చేయించాలని కోరారు.

క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యం


టీబీ నివారణపై ప్రతిజ్ఞ చేస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వర్లు, టీబీ యూనిట్ సిబ్బంది

మార్కాపురం: క్షయవ్యాధి నిర్మూలన దిశగా కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించి టీబీ వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, టీబీ బాధితులకు ప్రభుత్వ వైద్యశాలల్లో ఉచితంగా మందులు అందజేస్తారని తెలిపారు. డీవైఎంహెచ్‌ఓ పద్మావతి మాట్లాడుతూ.. ప్రజలందరూ టీబీపై అవగాహన కలిగి ఉండాలని, రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నట్లయితే క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె రాహుల్, డాక్టర్ బి.శివారెడ్డి, టీబీ యూనిట్ సిబ్బంది పి.గోవిందరాజులు, పి.లక్ష్మీరెడ్డి, ఆవులయ్య, సత్యనారాయణ, పీహెచ్‌సీ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైద్యశాలలో క్షీణించిన పారిశుధ్యం


అధ్వానంగా మారిన పీహెచ్‌సీ ఆవరణ

రాచర్ల: మండలంలోని అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. ఆరోగ్య కేంద్రం ఆవరణలో పశువులు సంచరిస్తూ ఎక్కడపడితే అక్కడ మలవిసర్జన చేయడంతో దుర్వాసన వస్తోంది. పీహెచ్‌సీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో వైద్యం కోసం వచ్చే రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైన వైద్యాధికారులు స్పందించి ఆస్పత్రిలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వీఆర్వోలకు పదోన్నతి కల్పించాలి


సమావేశంలో పాల్గొన్న గ్రామ రెవెన్యూ అధికారులు

గిద్దలూరు రూరల్: గ్రామ రెవెన్యూ అధికారుల్లో అర్హులైన వారికి సీనియర్ సహాయకులుగా, ఆర్ఐలుగా ప్రమోషన్లు కల్పించాలని రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు వైపీ రంగయ్య ఆధ్వర్యంలో బుధవారం ఉద్యోగులు కలిసి తీర్మానం చేసుకున్నారు. గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1గా ప్రమోషన్లు కల్పించాలని, రేషనలైజేషన్‌లో 2019కి పూర్వం ఉన్న రెవెన్యూ క్లస్టర్ విధానాన్ని పాటించాలని కోరారు. వీఆర్వోలకు సచివాలయాలతో సంబంధం లేకుండా తహసీల్దార్ పర్యవేక్షణలో విధులు నిర్వహించే విధంగా ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు వెంకటరామయ్య, రాజశేఖర్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, అచ్చయ్య, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

